స్కెచ్

# కొత్త పెళ్లి కూతురు

"క్రాంతా"

అక్కా,

నువ్వు వ్రాసిన ఉత్తరానికి జవాబు ఏమని రాయాలో తెలియక యింత ఆలస్యం చేశాను. వివాహమంటేనే యేవగించుకునే నీకు స్త్రీ వైవాహిక జీవితంలో యేర్పడే ఇబ్బందులు తెలియవు. కాపురానికి వచ్చిన మూడు నెలలలోనే నలుగురు పిల్లల తల్లిలాగా రాస్తున్నానని మాత్రం అనుకోవద్దు.

జీవితం నిర్మలంగా, నిష్కల్మషంగా గడపాలని రాశావు. ఎట్టి పరిస్థితులలోనైనా కల్ల కపటాలకు తావు యివ్వవద్దన్నావు. ఇక్కడికి వచ్చేముందు మన మందరము కూర్చొని మాట్లాడుతుంటే 'స్త్రీ కపటి' అని వారన్నందుకేనా యింతకోపం? స్త్రీని గురించి అంత తక్కువ అభిప్రాయమే వుంటే, వివాహమాడకుండా వుండటమే మంచిదన్నావు నీవు. వారు తమ సహజ సరళత్వంతో నవ్వి వూరుకున్నారు. వారన్నమాట యెంతనిజమో నాకిప్పుడు తప్ప తెలియటము లేదు.

అక్కా, నీవు యెంతో చదివావు కాని మానవ స్వభావాన్ని గురించి ఒక్క రోజైనా ఆలోచించలేదేమో ననిపిస్తుంది. నిజం పలకటం వలన కలిగే కొద్ది కష్టాన్నైనా హృదయం సహించలేదు. వందలకొలదీ అబద్ధాలు పలకటం వలన క్షణికమాత్రం సుఖం కలిగినా దానికోసమే ఆశిస్తాము.

మేము యిక్కడకు వచ్చినరోజు రాత్రి జరిగిన విషయం. నన్ను దగ్గరకు తీసుకొని అడిగారు: "అమ్మన్నా, నీకు మాయిల్లు వదలివచ్చినందుకు దిగులుగా లేదా" అని. నాకు సమాధానం యేమనిచెప్పాలో తెలియలేదు. నేను మౌనంగా వుండటం చూసి వారన్నారు: "నువ్వేమీ సందేహించ నవసరంలేదు. ఎన్నో పనులమీద బయట తిరిగే నాకే పదిరోజులు యిల్లు విడిచివెళ్తే బెంగగా వుంటుంది, నీకు వుండటంలో ఆశ్చర్యం లేదు." అంతకుముందే ఒక గంటగా మిమ్మల్నందరిని తలచుకొని ఏడ్చి వుండటంచేత అబద్ధమాడ బుద్ధిపుట్టలేదు.

'అవును, బెంగగానే వుంది. ఈ రోజు మా అక్కను, మా గోపిని తలచుకొని కంట తడి పెట్టని నిముషం లేదు' అన్నాను. ఇదంతా అద్దం ముందు నిలబడి మాట్లాడుకుంటున్నాము. పై విధంగా సమాధానం చెప్పి నేను కళ్ళెత్తి చూతునుగదా, ఆ సన్నని వెలుతురులో కూడా వారి కళ్ళల్లో కనపడే బాధను చూసి సహించలేక పోయినాను. ఒక అయిదు నిముషాల తరువాత యెంతో విచారంగా అన్నారు. 'స్త్రీ జీవితమంతా యింతే! పుట్టుకతో యేర్పడే ప్రేమలు ఒకచోట. జీవిత ధర్మంలో ప్రయత్న పూర్వకంగా అలవరచుకొన వలసిన ప్రేమ లింకొకచోట.'

అక్కా! నేను జీవితంలో ఎటువంటి కష్టాన్నైనా ఓర్వగలనేమో కాని వారు విచారంగా వుంటే మాత్రం చూడలేను. అందువలన వెంటనే అన్నాను: 'నన్నుగురించి మీరేమీ బాధ పడ నవసరం లేదు. నాకెట్టి విచారము లేదు. మీ చేయి తాకగానే యీ ప్రపంచమే మరుస్తాను' నా మాటలు విని వారు నవ్వారు.

'నా తృప్తికోసం యీ విధంగా మాట్లాడుతున్నావు. ఇది నిజంగా నటన కదూ?' 'కాదు, ఒట్టు' అన్నాను. వారికి నా మాటలో నమ్మకం కుదిరినట్లు కనపడలేదు. కాని వెనుకటి విచారం మాత్రం ముఖంలో లేదు.

నగ్నసత్యం బహు కఠోరమైనది. తామరాకులో నీటి బిందువువలె జీవితాన్ని గడపగలయే కొద్దిమందో దాన్ని అభిలషిస్తారు. సామాన్యులు ఒక విషయం అబద్ధమని తెలిసికూడా అదినమ్మితే మనశ్శాంతి చేకూరే టట్లయితే దానినే నమ్మటానికి ప్రయత్నం చేస్తారు.

ఈ మూడు నెలల్లో నేను మిమ్మల్నందరినీ తలుపుకు తెచ్చుకొని యేడవని రోజులు చాలా తక్కువ. కాని ఆ రోజు మొదలు యిప్పటి వరకు కూడా వారికి నేనావిధంగా యేడుస్తున్నాననే తెలియదు. ఆఫీసునుండి యింటికి రాగానే నేను నవ్వుతూ సంతోషంగా మాట్లాడితే వారి ముఖంలో కనపడే తృప్తి చూసి తీరాలి. నేను కొద్దిగా చిన్నబుచ్చుకుంటే వారు పడే బాధ యింతా అంతా కాదు. అక్కా, ఆ విధంగా కేవలం నాముఖ కవళికలనే తన సౌఖ్యానికి ఆధారం చేసుకొని జీవించే వారి కొఱకై నేను ఒకటి రెండు అబద్ధాలు చెప్పినా తప్పులేదనుకుంటాను

ఇటువంటి సమస్యలు ప్రతి రోజూ యెన్నో యెదుర్కొనవలసి వస్తూవుంటుంది. నెలరోజుల క్రిందట మా అత్తగారు పిల్లలతో కూడావచ్చారు. అక్కా, వయసు వచ్చిన కొద్దీ కొత్తవరసల కలవాటు పడటం యెంత కష్టమో నా కప్పుడు తప్ప తెలియలేదు. మా అత్తగారిని నేను పెండ్లిలో చూడటమే తప్ప అర్థం చేసుకొనటానికి యెక్కువ అవకాశం దొరకలేదు. ఆ విధంగా పిల్లల సౌఖ్యంకోసం తమ సౌఖ్యాన్ని ధార పోసే వ్యక్తులు చాలా తక్కువ మంది వుంటారనుకుంటాను. ఆవిడ వున్నన్ని రోజులూ అమ్మని మరిపించింది. ఆవిడ విషయంలోకూడా నేను అంత ప్రేమతోనూ ప్రవర్తించాననే అనుకున్నాను. కాని ఒక రోజు రాత్రి వారన్నారు: 'మా అమ్మ 'కోడలు కోడలని' కొన్ని సంవత్సరాలుగా కలవరించింది. ఈ రోజుకు నీవు ఆవిడకు కనబడుతున్నావు. 'అత్తా' అని ఆవిడను నీవెందుకు పిలవవు?' వారు చెప్పేదాకా నేనావిధంగా లోపం చేస్తున్నాననే నాకు తెలియదు. మర్నాటినుండీ ఆవిడతో మాట్లాడినప్పుడల్లా ప్రయత్నపూర్వకంగా 'అత్తగారూ' అని పిలుస్తూవుండే దాన్ని.

ఇటువంటి ప్రవర్తన అంతా దానికి అలవాటు పడేవరకు అస్వభావికంగానే కన్పిస్తుంది. కాని యే స్త్రీకి తప్పుతుంది? గోపి వయస్సున వున్న నా మరిదిని 'ఏమయ్యా' అని గాని 'ఏమోయి' అని గాని పిలవాలి. నాతో బాటు ఆడుతూ పాడుతూ తిరిగేలక్ష్మిని 'వదినగారూ' అనిపిలవాలి.

అంతేకాదు. పదిరోజుల క్రిందట నాన్నగారు వచ్చారు. నెక్‌లెస్ ఒకటి నాకు కొనాలని వున్నదని నన్ను బజారు తీసుకెళ్ళారు. నాకు కావలసినది తీసుకోమన్నారు. ఒక నెక్‌లెస్ యెంతో బాగుంది కాని ధర తెలుసుకొన్న తరువాత నాన్నగారిని అది కొనమనటానికి మనసొప్పలేదు. కాని నాన్నగారు నేనెంతచెప్పినా వినకుండా దానినే కొంటుంటే నాకెంతో సిగ్గేసింది. ఆరోజుఅంతా యేదో తప్పుచేసినట్టే బాధపడ్డాను. ఈ కొద్దిరోజులలో నాలో వచ్చిన మార్పుకు నాకే ఆశ్చర్యం వేసింది. నీకు గుర్తువుండే వుంటుంది. నాకు కావలసిన వస్తువు యేదైనా కొనకపోయినట్లయితే, మన తాహతుకు తగదని నాన్నగారు చెప్పినా వినకుండా యింట్లో అందరితో పోట్లాడి, ఆపూట భోజనం మాని, అఘాయిత్యంచేసి కొనిపించే దాన్ని.

ఒకరోజు సాయంత్రం మాదొడ్లో కొత్తగా నాటిన ఒక మొక్కను చూసి వారన్నారు: 'ఆ మొక్కకు స్త్రీకి యెంత పోలిక వున్నదో? పుట్టిన స్థలంనుండి వేరుతో పెకలించి తెచ్చి యిక్కడ నాటాము. తన పరిసరాలకు అలవాటు పడేవరకూ ఆవిధంగానే వాడి వుంటుంది. కాని తరువాత అదే పెద్దదై పూవులు పూస్తుంది.' నేనూ ఆవిధంగానే త్వరలోనే యిక్కడే పాతుకుపోతాననుకుంటాను.

కాని ఒక్క విషయం మాత్రం విపరీతమైన భయం కలిగిస్తుంది. ఒకవేళ వారికీ నాన్నగారికీ భేదాభిప్రాయమే యేర్పడేటట్లయితే నాగతి యేమవుతుంది? పెండ్లి అయినరోజునుండే నా జీవితం వారి జీవితంతో పెనవేసుకుపోయింది. నేను కాహాలన్నా వేరుచేసుకొని రాలేను. కాని మీ అందరికీ దూరమైపోగలనా? నేనుపోట్లాడినప్పుడల్లా, అమ్మ అంటూ వుండేది - నీకు గుర్తుందా? "అందరినీ తొమ్మిది నెలలే మోస్తే, నిన్ను పదినెలలు మోశానే! నన్నెందుకు బాధిస్తావే!" అని. అక్కా, అటువంటి తల్లికి వేరై జీవితం గడపగలనా?

అందుకనే అటువంటి భేదాభిప్రాయమే రాకూడదని ప్రార్థిస్తూవుంటాను.

అక్కా, ఇక సెలవు. ఇప్పటికే చాలా పొద్దుపోయింది—నీ ప్రియమైన చెల్లెలు.